నమస్తే తెలంగాణ
# సంగారెడ్డి
I | హైదరాబాద్, సోమవారం 16 సెప్టెంబర్ 2024 | SANGAREDDY



హుస్నాబాద్‌లోని ఎల్లమ్మ చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

## నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి

- అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలి
- రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్
- హుస్నాబాద్‌లోని ఎల్లమ్మ చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

హుస్నాబాద్, సెప్టెంబర్ 15: హుస్నాబాద్ నియోజకవర్గంలో వినాయక విగ్రహాల నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించుకోవాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఆదివారం హుస్నాబాద్ పట్టణ శివారులోని ఎల్లమ్మ చెరువు వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, ఆర్డీవో రామ్మూర్తి, ఏసీపీ సతీశ్‌తో కలిసి నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. హుస్నాబాద్‌లోని ఎల్లమ్మ చెరువు వద్ద నిమజ్జనం కోసం ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. నిమజ్జనం చేసే స్థలంలో లైటింగ్, బారికేడ్లు, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయిస్తామన్నారు. విగ్రహాలను వాహనాల్లో తీసుకొస్తున్నప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని, ఊరేగింపును ఎలాంటి సమస్యలు తలెత్తకుండా నిర్వహించుకోవాలన్నారు. విగ్రహాలను నిమజ్జనం చేసే సమయంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉన్నందున, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, పోలీసు అధికారులు, సిబ్బంది శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చూసుకోవాలన్నారు. మంత్రి వెంట మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కౌన్సిలర్లు వల్లపు రాజు, భూక్య సరోజన పాల్గొన్నారు.



జగదేవ్‌పూర్‌లో మాట్లాడుతున్న ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాలువ సుజాత

## ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి

### ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాలువ సుజాత

జగదేవ్‌పూర్ సెప్టెంబర్15: పేద ఆర్యవైశ్యుల అభ్యున్నతికి ఆర్యవైశ్య కార్పొరేషన్ ద్వారా తోడ్పాటు అందిస్తామని చైర్‌పర్సన్ కాలువ సుజాత అన్నారు. ఆదివారం జగదేవ్‌పూర్‌లోని వేంకటేశ్వరాలయంలో వైశ్యసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశుని వద్ద లక్షపుష్పార్చనలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డితో కలసి ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతు జగదేవ్‌పూర్ వేంకటేశ్వరాలయం, వైశ్య భవనానికి నిధులు మంజూరు చేయించనున్నట్లు తెలిపారు. వైశ్యులు తామ సంపాదించిన దాంట్లో పేదలకు సహాయం చేసే గుణం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, వైశ్యసంఘం మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షుడు కొండల్, పట్టణ కార్యదర్శి అమరరామ్‌నివాస్, వైశ్య సంఘం జిల్లా యువజన అధ్యక్షులు చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ హరినాథ్,నాయకులు అమరరాము, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు సబిత, కార్యదర్శి జ్యోతి, కాంగ్రెస్ నాయకులు మల్లేశం,కరుణాకర్, మాజీ సర్పంచులు వెంకటయ్య, జ్యోతిమహేందర్, వైశ్యసంఘం రాష్ట్ర నాయకులు బాల్‌నారాయణ, బుద్ధసత్యం, వొల్లాల వెంకటేశ్, గుబ్బశ్రీనివాస్ పాల్గొన్నారు.



మహా అన్నదానం నిర్వహించే ముందు పూజలు చేస్తున్న కొమురవెల్లి శ్రీమల్లికార్జున స్వామి వారి ఆలయం ఈవో

## 'మల్లన్న' ఆలయంలో మహా అన్నదానం

చేర్యాల, సెప్టెంబర్15: కొమురవెల్లి శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామి వారి ఆలయంలో ప్రతిష్ఠించిన వినాయక మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ ఈవో బాలాజీ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు మహా అన్నదానం చేశారు. స్వామి వారి ఆలయంలో రెండు క్వింటాళ్ల బియ్యాన్ని అన్నంగా తయారు చేసి అనంతరం ఈవో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో, సూపరింటెండెంట్లు, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



సిద్దిపేట జిల్లా నాగపురి గ్రామ రెవెన్యూ పరిధిలోని శభాష్‌గూడెం వీరభద్ర స్వామి వారి ఆలయం

# దేవుడి భూమికి ఎసరు..!


## శభాష్‌గూడెం వీరభద్రస్వామి భూమి అన్యాక్రాంతం

- దేవుడికి దానమిచ్చిన భూమిని పట్టాచేసిన రెవెన్యూ అధికారులు
- దేవుడి భూమిగా దేవాదాయ శాఖ రికార్డుల్లో నమోదు
- విరాళం ఇచ్చిన వ్యక్తి కూతురి పేరిట పట్టా.. అనంతరం ఆమె వారసుడి పేరిట పట్టా
- పాసుపుస్తకాలు రద్దు చేయాలని లేఖరాసిన దేవాదాయ శాఖ అధికారులు
- కొలతలు వేసి హద్దుల ఏర్పాటుకు పట్టాదారులు యత్నం
- భూమిని కాపాడేందుకు పోరాడుతున్న శభాష్‌గూడెం గ్రామస్తులు




ఆలయం భూమి కోసం పోరాడుతున్న నాగపురి గ్రామ రెవెన్యూ పరిధిలోని శభాష్‌గూడెం గ్రామస్తులు

చేర్యాల,సెప్టెంబర్15: దేవుళ్ల భూములకు రక్షణ లేకుండా పోతున్నది. దేవుడికి విరాళంగా ఇచ్చిన భూ ములు, దేవుడి పేరిట నమోదైన భూములను కొందరు రెవెన్యూ అధికారులు విరాళమిచ్చిన వారుసులకు పట్టా చేసి దేవుడికి అన్యాయం చేస్తున్నారు. విరాళం ఇచ్చిన భూమి దేవుడి పేరిట ఉండాలని కొన్నేండ్లుగా సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం శభాష్‌గూడెం ప్రజలు పోరాడుతున్నారు. దేవుడి భూమిని కాపాడేందుకు పొరుగూరు నాగపురి గ్రామస్తులతో కలిసి ఐక్యంగా పోరాడుతున్నారు. చేర్యా ల మండలం శభాష్‌గూడెం గ్రామంలో కొలువైన వీరభద్ర స్వామి భూమి అన్యాక్రాంతం చేసేందుకు కొం దరు యత్నిస్తున్నారు.దేవుడి పేరిట భూమి నమోదైందనే విషయాన్ని పట్టించుకోకుండా రెవెన్యూ అధికారులు తమ హస్తవాసి చూపించడంతో దేవుని భూమికి ఎసరొచ్చింది. విరాళంగా ఇచ్చిన భూమిని రెవెన్యూ రికార్డులను తమకు అనుకూలంగా మార్చుకున్న దాత కూతురు మొదటగా తప పేరిట పట్టా చేయించుకున్నారు. అనంతరం ఆమె వారసుడు మరోసారి పట్టా చేయించుకున్నారు. ఇటీవల దేవాలయ భూమిని కొలతలు వేయించేందుకు వారసులు యత్నిస్తుంచడంతో వెంటనే నిలిపివేయాలని, దేవుడి భూమిని రక్షించాలని చేర్యాల తహీసీల్ కార్యాలయం వద్ద గ్రామస్తులు ఆందోళన దిగారు.అనంతరం దేవుడి భూమి కాపాడలని రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు.



వీరభద్ర స్వామి వారికి రామచంద్రయ్య రాసి ఇచ్చిన కాగితం



దేవాదాయ రిజిస్టర్‌లో నమోదైన వీరభద్ర స్వామి ఆలయ భూమి

**తండ్రి విరాళం...దక్కించుకునేందుకు వారసుల యత్నం**

నాగపురి గ్రామ రెవెన్యూ పరిధిలోని శభాష్‌గూడెంలో 705 సర్వేనంబర్‌లో వీరభద్ర స్వామి ఆలయం ఉంది. ఆలయానికి ఎలాంటి ఆదాయ వనరులు లేకపోవడంతో గ్రామానికి చెందిన ఉప్పల రామచంద్రయ్య సర్వే నెం 705లో 7.30 ఎకరాల భూమిని దేవుడి పేరిట పట్టా చేసుకోవాలని 28 జూన్ 1981న ఆలయానికి విరాళంగా సాదాబైనామా రాసి ఇచ్చాడు. ఇదే సర్వేనంబర్‌లో మిగిలిన మూడెకరాల భూమిని దళితుల ఇండ్ల స్థలాల కోసం అందజేసినట్లు రెవెన్యూ రికార్డుల్లో నమోదైంది. సదరు భూములపై తమ వారసులకు ఎలాంటి హక్కులు ఉండవని విరాళంగా ఇచ్చిన పత్రంలో దాత ఉప్పల రామచంద్రయ్యా రాయించి గ్రామస్తులకు అందజేశారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం 1981 నుంచి 2012 వరకు పట్టాదారుడిగా ఉప్పల రామచంద్రయ్య పేరు రాగా, కాస్తుకాలంలో మాత్రం ఆలయ భూములుగా వచ్చింది.పెరిగిన భూ ధరల కారణంగా రామచంద్రయ్య వారసులు భూమిని దక్కించుకునేందుకు యత్నిస్తుండడంతో తరుచూ గ్రామంలో ఆందోళనలు నెలకొంటున్నాయి.

**రెవెన్యూ రికార్డుల్లో ఉన్న పట్టా మార్పిడి**

ఉప్పల రామచంద్రయ్య గ్రామానికి భూమిని రాసిచ్చినప్పటి నుంచి రెవెన్యూ రికార్డుల్లో వీరభద్ర స్వామి ఆలయం పేరిట ఉంది.2007లో సదరు భూమి దేవాదాయశాలో నమోదైంది. కానీ, 2013లో ఉప్పల రామచంద్రయ్య కూతురు ఎలిషాల లక్ష్మి పేరిట పట్టా మార్పిడి జరిగింది. గతంలో శభాష్‌గూడెం నాగపురి పంచాయతీ పరిధిలో ఉండడం అప్పుడు పెద్దగా భూముల ధరలకు డిమాండ్ లేకపోవడంతో పట్టామార్పిడి విషయం బయటకు పొక్కలేదు.రాష్ట్ర ఏర్పాటు అనంతరం కొత్త జిల్లాలు, పంచాయతీలు లేర్పాటు కావడంతో నాగపురి నుంచి విడిపోయి శభాష్‌గూడెం గ్రామ పంచాయతీగా అవతరించింది.ఈ క్రమంలో గ్రామ అభివృద్ధి కోసం నాడు ప్రతి గ్రామంలో నర్సరీ, వైకుంఠధామం, డంపింగ్ యార్డు తదితర వాటిని ఏర్పాటు చేసుకోవాలని నాటి సర్కారు ఆదేశాలు జారీచేసింది. గ్రామంలో భూమి లేకపోవడంతో నర్సరీ తదితర నిర్మాణాలను ఇదే భూముల్లో గ్రామస్తులు ప్రారంభించారు.తన పేరిట పట్టాగా ఉన్న భూమిలో నిర్మాణాలు జరుగుతున్నాయన్న విషయం తెలుసుకున్న ఎలిశాల లక్ష్మి కోర్టును ఆశ్రయించింది. దీంతో సదరు భూమిలో నిర్మాణాలు నిలిచిపోయాయి.డిసెంబర్ 2023లో ఇదే భూమిని లక్ష్మి ఎలిశాల ఆనంద్ పేరిట పట్టా చేయడంతో గ్రామస్తులు ఒక్కసారిగా భగ్గుమన్నారు.వివాదం కొనసాగుతున్న భూమి విషయంలో నాటి రెవెన్యూ అధికారులు లంచాలు తీసుకుని పట్టా మార్పిడి చేశారని ఆరోపణలు వచ్చాయి.

**పట్టని రెవెన్యూ అధికారులు..**

శభాష్‌గూడెంలోని వీరభద్ర స్వామి ఆలయం దేవాదాయ రికార్డుల్లో నమోదై ఉంది. ఉప్పల రామచంద్రయ్య దానం ఇచ్చిన 7.30గుంటల భూమి దేవాదాయ శాఖ 43 రిజిస్టర్‌లో నమోదు చేశారు. దేవుడి భూమి పట్టా మార్పిడి జరిగిందనే విషయాన్ని తెలుసుకున్న గ్రామస్తులు దేవాదాయ శాఖ అధికారులకు తెలియజేయడంతో వెంటనే పట్టాదారు పాసు బుక్కులు రద్దు చేయాలని తహసీల్ కార్యాలయానికి లేఖను సైతం పంపించారు. కానీ, రెవెన్యూ అధికారులు మాత్రం పట్టించుకోలేదు. దేవాదాయ, రెవెన్యూ శాఖ అధికారులు శ్రద్ధ వహించి ఆలయ భూములను కాపాడాలని శభాష్‌గూడెం, నాగపురి గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

### దేవుడి భూమిని కాపాడేందుకు గ్రామస్తుల యత్నం..

గ్రామంలోని దేవాలయ భూమిని కాపాడేందుకు శభాష్‌గూడెం గ్రామస్తులు కొన్నేండ్లుగా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.ప్రభుత్వ భూములు, ఆలయ భూములు నిషేధిత జాబితాలో పొందుపర్చినప్పటికీ, వీరభద్ర స్వామి ఆలయ భూములను రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో ధరణి పోర్టల్‌లో ఆ భూమి నమోదు కాలేదు.దీంతో అధికారులు డబ్బులు తీసుకుని పట్టామార్పిడి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దేవుడి పేరిట విరాళం ఇచ్చిన భూమిని పట్టా చేశారని, వాటిని రద్దుచేసి వీరభద్రుని పేరిట పట్టాదారు పాసు బుక్కులు ఇవ్వాలని గ్రామస్తులు ఇప్పటి మూడుసార్లు తహసీల్ కార్యాలయం వద్ద ఆందోళన చపట్టారు. భూమిని కాపాడేందుకు కోర్టుకు వెళ్లి ఇంజక్షన్ ఆర్డర్ సైతం తీసుకువచ్చారు. కానీ, పట్టాదారులమంటూ ఎలిశాల ఆనంద్ భూములు కొలతలు వేసే జిల్లాస్థా యి అధికారిని తీసుకువచ్చేందుకు యత్నించగా, గ్రామస్తులు తహసీల్ కార్యాలయం వద్ద మరోసారి ఆందోళన చేపట్టారు. సర్వే నిర్వహించవద్దని, పట్టా రద్దు చేయాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

### విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం..

వీరభద్ర స్వామి ఆలయ భూములను కాపాడాలని గ్రామస్తులు ఇటీవల వినతిపత్రం అందజేశారు.శభాష్‌గూడెం, నాగపురి గ్రామస్తుల వినతి మేరకు విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటాం.ఇప్పటికే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సర్వేయర్ తదితరులతో వీరభద్ర స్వామి ఆలయం భూసమస్యను తేల్చాలని ఆదేశాలు జారీచేశాను.విచారణ అనంతరం ఆలయ భూముల విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం.

–సమీర్ హైమద్‌ఖాన్, తహసీల్దార్ చేర్యాల (సిద్దిపేట జిల్లా)

## ప్రయాణం నరకప్రాయం

- గుంతలమయంగా జహీరాబాద్-బీదర్ ఆర్‌అండ్‌బీ రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న వాహన చోదకులు
- తరుచూ చోటుచేసుకుంటున్న ప్రమాదాలు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు

న్యాల్‌కల్, సెప్టెంబర్ 15: సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని జహీరాబాద్-బీదర్ ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా మారి వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. నిత్యం ఈ రోడ్డు మీదుగా వేలాది వాహనాల రాకపోకలు సాగిస్తాయి. ఈ రోడ్డు మార్గంలో తొమ్మిది కిలో మీటర్ల మేర మరమ్మతులు చేపట్టేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం స్టేట్‌ఫండ్ కింద రూ. 320 లక్షల నిధులు మంజూరు చేసింది. కానీ, సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో ఈ రోడ్డుకు నేటికి మరమ్మతులు నోచుకోవడం లేదు. న్యాల్‌కల్ మండలంలోని కొత్తూరు(బి) నారింజవాగు ప్రాజెక్టు నుంచి మెటల్‌కుంట గ్రామ చౌరస్తా వరకు ఉన్న రోడ్డు మార్గంలో మోకాళ్లలోతు గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డు మార్గంలో ప్రయాణించాలంటేనే ప్రయాణికులు జంకుతున్నారు. గుంతల రోడ్డుపై వాహనాలు అదుపుతప్పి నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వాహనాలు దెబ్బతింటున్నాయని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రిళ్లు ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పోవాల్సిన పరిస్థితి ఉంది. ప్రమాదాలకు గురై పలువురు మృతిచెందగా, మరికొందరు తీవ్రగాయాలైన సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని వాహనచోదకులు, ప్రజలు కోరుతున్నారు.



అధ్వానంగా నిత్యం రద్దీగా ఉండే జహీరాబాద్- బీదర్ ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్గం



నారింజ వాగు సమీపంలోని జహీరాబాద్-బీదర్ రోడ్డు మార్గంలో ప్రమాదకరంగా మారిన గుంతలు

# సాగునీరు మహాప్రభో..!

- సాగునీళ్లు లేక ఎండుతున్న వరి పొలాలు
- కాళేశ్వరం కాలువల్లో కనిపించని నీళ్లు
- కొండపోచమ్మ ద్వారా నీళ్లు వదలాలని కోరుతున్న రైతులు
- అధికారులు స్పందిస్తేనే పంట చేతికి

గజ్వేల్, సెప్టెంబర్ 15: కాళేశ్వరం కాలువ పక్కన పొలాలున్న రైతులు మూడేండ్లుగా వరి సాగు పంట పండించుకుంటున్నారు. ఈ ఏడాది కూడా రైతులు సుమారు 100 ఎకరాల వరకు కాలువ పక్కన భూముల్లో వరి సాగు చేశారు.కాలువల్లో ఉన్న కొద్దిపాటి గోదావరి జలాలతో నాటు వేసిన రైతులకు ప్రస్తుతం వరికి సాగు నీళ్లు అందించడం కష్టంగా మారింది. కాళేశ్వరం కాలువల్లోకి సాగు నీళ్లు వదలక పోవడంతో వరి పొలాలు తడారి ఎండిపోతున్నాయి. గజ్వేల్ మండలం మక్తమాసాన్‌పల్లి రైతులు 30 ఎకరాలు, బంగ్లావెంకటపూర్ గ్రామ రైతులు 70 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఈ గ్రామాల మీదుగా వెళ్లే రామాయంపేట కాలువల్లోకి వర్గల్ మండలం జబ్బాపూర్ వద్ద సాగునీళ్లను వదిలితేనే సాగు చేసిన పంటలు చేతికొస్తాయి. మూడేండ్లుగా రామాయంపేట కాలువలోని నీళ్లపై ఆధారపడి రైతులు వరిసాగు చేసి పంటలు పండించుకున్నారు. కొండపోచమ్మ సాగర్ ద్వారా రామాయంపేట కాలువలోకి జబ్బాపూర్ వద్ద గోదావరి జలాలను వదిలితేనే రైతులు సాగు చేసిన వరిని బతికించుకునే అవకాశాలున్నాయి. వారం రోజులుగా వర్షాలు కురవకపోవడంతో పొలాలు ఎండిపోతున్నాయి. వేలాది రూపాయల పెట్టుబడి పెట్టి వరిసాగు చేసిన రైతులు పంటలు పండాలంటే ప్రస్తుతం రామాయంపేట కాలువలోకి గోదావరి జలాలను వదలాల్సిందే. ప్రభుత్వం స్పందించి రామాయంపేట కాలువలోకి నీళ్లు వదిలేలా ఆదేశాలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అధికారులు సాగుకు నీళ్లు ఇచ్చిన విధంగానే ఈసారి కూడా విడుదల చేయాలని కోరుతున్నారు. వందలాది ఎకరాల్లో సాగు చేసిన వరి పంట చేతికి రావాలంటే అధికారులు స్పందించాలి.



సిద్దిపేట జిల్లా మక్తమాసాన్‌పల్లిలో నీళ్లు లేక తడి ఆరిపోతున్న వరి



సిద్దిపేట జిల్లాలో నీళ్లలేక బోసిపోయి కనిపిస్తున్న రామాయంపేట కాలువ

### కాలువల్లోకి నీళ్లు వదిలితేనే పంటలు దక్కేది..



మక్తమాసాన్‌పల్లి, బంగ్లావెంకటపూర్, వీరానగర్ గ్రామాల రైతులం రామాయంపేట కాలువలోకి వచ్చే సాగునీళ్లపై ఆధారపడి మూడేండ్లుగా వరి పండిస్తున్నం. గతేడాది లాగే ఈ సీజన్‌లో కూడా వందలాది ఎకరాల్లో రైతులం వరిపంట వేసినం. గతంలో కాలువలోకి నీళ్లు వదిలారు. 15 రోజులుగా రామాయంపేట కాలువలోకి నీళ్లు వదలక పోవడంతో పొలాలు ఎండిపోతున్నారు. వానలు ఏమో కురవడం లేదు. ఇప్పటికైనా అధికారులు కాలువలోకి నీళ్లు వదిలి పొలాలను కాపాడాలి.

– చిట్యాల రవీందర్, రైతు,మక్తమాసాన్‌పల్లి

## ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

- రాష్ట్ర వ్యవసాయ వర్సిటీ రిజిస్ట్రార్, ప్రొఫెసర్ రఘురాంరెడ్డి
- ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన 78మంది పూర్వ విద్యార్థులకు సన్మానం




సంగారెడ్డి జిల్లా కందిలోని వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ డే వేడుకల్లో పాల్గొన్న ప్రొఫెసర్లు, విద్యార్థులు, పూర్వవిద్యార్థులు

కంది, సెప్టెంబర్ 15 : నూతన సాంకేతిక పద్ధతులు అందిపుచ్చుకొని వ్యవసాయరంగాన్ని మరింత అభివృద్ధి చేయాలని జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్, ప్రొఫెసర్ డాక్టర్ పి.రాఘురాంరెడ్డి ఇంజినీరింగ్ విద్యార్థులకు సూచించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినాన్ని పురస్కరించుకొని ఆదివారం సంగారెడ్డి జిల్లా కందిలోని వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ డే నిర్వహించారు. ఈ వేడుకలకు ప్రొఫెసర్ రఘురాంరెడ్డి, రిటైర్డ్ డీన్ డాక్టర్ కె.సదాశివరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రఘురాంరెడ్డి మాట్లాడుతూ..వాతావరణ మార్పులు తట్టుకునేలా, తక్కువ ఖర్చుతో లాభసాటి పంటలు పండేలా ప్రయోగాలు చేసి రైతులకు ఫలాలు చేరువ చేయాలన్నారు. కృత్రిమ మేథ, డ్రోన్ టెక్నాలజీ, రిమోట్ సెన్సింగ్‌ను విరివిగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ మనోజ్‌కుమార్, ప్రొఫెసర్ డాక్టర్ డి.కల్పనా, కళాశాల ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. కంది వ్యవసాయ కళాశాలలో 2011-2018 వరకు చదివిన 78మంది పూర్వ విద్యార్థులు నీటిపారుదల శాఖ,ఆయకట్టు అభివృద్ధి శాఖలో ఉద్యోగాలు సాధించారు. 2023 మేలో రాష్ట్ర వ్యాప్తంగా 100 ఏఈఈ పోస్టులకు పరీక్షలు జరగగా,2023 జూలైలో ఫలితాలు వచ్చాయి. ఇందులో కంది వ్యవసాయ కళాశాలకు చెందిన 78మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వారిని ఘనంగా సన్మానించారు.

### రైతులకు మేలు జరిగేలా కృషి



మాది రైతు కుటుంబం, రైతులు పడే కష్టాలు తెలుసు కాబట్టి వారికి మేలు జరిగేలా కృషి చేస్తా. ఏఈఈ ఉద్యోగానికి సెలక్ట్ కావడం ఆనందంగా ఉంది. చెరువులు, ఆయకట్టులు అభివృద్ధి చేసి రైతులు లాభసాటి పండించుకునేలా అవగాహన పెంచుతా.

అభిజ్ఞ, మహబూబ్‌నగర్ (పూర్వ విద్యార్థి)

### ఉద్యోగం రావడం సంతోషంగా ఉంది



ఏఈఈ ఉద్యోగానికి ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది. పంటల సాగుపై రైతులకు మరింతగా అవగాహన పెంచుతా. ప్రతి నీటి బొట్టునూ ఒడిసి పట్టి రైతులు ఉపయోగించుకునేలా కృషిచేస్తా.

– మేఘన, సంగారెడ్డి (పూర్వ విద్యార్థి)

### సాగునీరు అందేలా చూస్తా



చెరువుల పూడిక తీయించడం,ఆయకట్టును పటిష్టం చేయడం, ఆయకట్టు కింద సాగు చేసుకునే రైతులకు నీటిఎద్దడి సమస్య తలెత్తకుండా, వర్షపు నీరు వృథా కాకుండా ఉపయోగించుకునేలా అవగాహన కల్పిస్తా.

– విశాల్, ఆదిలాబాద్ (పూర్వ విద్యార్థి)